ప్రజలకు అండగా ఉందాం

- అవినీతి రహిత పాలన అందించాం
- మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

కొవ్వూరు: అమలు సాధ్యం కాని హామీలతో చంద్ర బాబు ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చారని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు పేర్కొన్నారు. పట్టణంలో క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం కొవ్వూరు మండలం, పట్టణ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతిరహిత సుపరిపాలన అందించారని, ఎవరి ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకే సంక్షేమ పథకాల ఫలాలు అందించారన్నారు. దీంతో పార్టీ శ్రేణులకు తమకు గుర్తింపు లేదనే భావన ఉందన్నారు. వలంటీర్ వ్యవస్థకు దేశ వ్యాప్తంగా గుర్తింపు లభించిందని, ప్రధాని మంత్రి సైతం ఈ వ్యవస్థను మెచ్చుకున్నారని అన్నారు. గడిచిన ఐదేళ్ల పాలనలో చోటు చేసుకున్న లోపాలను సరి చేసుకుంటూ ప్రజల పక్షాన నిలబడదామని నాయకులకు సూచించారు. జగనన్న పాలనలో పార్టీ రహితంగా సంక్షేమ పథకాలు అమలు చేశామని అన్నారు. రానున్న రోజుల్లో టీడీపీ ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాల అందించడం కచ్చితంగా వివక్ష చూపిస్తుందని అన్నారు. కార్యకర్తలకు, నాయకులకు అన్ని వి. ధాలుగా అండదండగా ఉంటామన్నారు. నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లోను వైఎస్సార్ సీపీ గెలుపొందిన విషయం ప్రతి ఒక్క నాయకుడు గుర్తుంచుకోవాలన్నారు. రానున్న ఐదేళ్ల ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి పోరాడుదామని పార్టీ శ్రేణులకు సూచించారు.



కొవ్వూరులో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు



కొవ్వూరు సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు

వైఎస్సార్‌సీపీకి నలభై శాతం ఓటు బ్యాంకు

సమావేశంలో పాల్గొన్న రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నలభై శాతం ఓట్లు సాధించిందన్నారు. అధికారంలోకి వచ్చిన టీడీపీకి వైఎస్సార్ సీపీకి కేవలం ఐదు లక్షల ఓట్లు మాత్రమే వ్యత్యాసం ఉందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల అమలుకు ఏడాదికి రూ.1.20 లక్షలు కోట్లు ఖర్చయితే ఇప్పుడు చంద్రబాబు ప్రకటించిన పథకాల కోసం రెట్టింపు సొమ్ము వెచ్చించాల్సి ఉంటుందన్నారు. పార్టీలో సంస్థాగతంగా ఉన్న లోపాలను సరిదిద్దుకుంటూ ముందుకి సాగుదామని శ్రేణులకు సూచించారు. నాయకులు, కార్యకర్తలకు ఏ ఇబ్బంది వచ్చినా తాను, వెంకట్రావు నిరంతరం అందుబాటులో ఉంటామని ప్రకటించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వ వైఫల్యాలే వైఎస్సార్ సీపీ గెలుపునకు దోహదపడతాయన్నారు. మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, గారపాటి వెంకటకృష్ణ, దేవగుప్తాపు లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ వీరమళ్ల నారాయుడు తదితరులు మాట్లాడారు. జెడ్పీటీసీ సభ్యురాలు బొంత వెంకటలక్ష్మి, ఉప్పులూరి సూరిబాబు, కంఠమణి రమేష్, అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, పరిమి సోమరాజు, తాడి వెంకటరెడ్డి, బత్తి నాగరాజు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు తోట రామకృష్ణ, బొల్లిన సతీష్, యలమాటి సత్యనారాయణ, కుందుల అబ్బులు, సర్పంచ్ మట్టా శ్రీనివాస్, కంచుమర్తి వెంకట్రావు, దేవన సత్యనారా యణ, అంకోలు వెంకట లిల్లీ పద్మ లీల, మద్దిపట్ల సాయి గీత, చీరా అరుణ పాల్గొన్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

నిడదవోలు రూరల్: మద్యం సేవించి భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ ఆదివారం తెలిపారు. కోరుమామిడి గ్రామానికి చెందిన దెయ్యాల శివన్నారాయణ, మణి భార్యభర్తలు. కొంతకాలంగా తన భర్త మద్యం సేవించి కుటుంబ పోషణ పట్టించుకోకుండా వేధిస్తున్నాడని భార్య మణి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

కొవ్వూరు: పట్టణంలో పాత శివాలయం వీధిలో పేకాడుతున్న ఏడుగురు వ్యక్తులను ఆదివారం మధ్యాహ్నం అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. వీరి నుంచి రూ.2,972 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుల్ని సోమవారం కోర్టుకి హాజరు పరచనున్నట్లు ఆయన తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ఉండ్రాజవరం: పిల్లలు లేని కారణంగా మనస్తాపం చెందిన వివాహిత పంట కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మోర్త గ్రామానికి చెందిన తోట రాశి (24) ఉండ్రాజవరానికి చెందిన దుర్గారావుతో 2020లో వివాహమైంది. నాలుగేళ్లయినా పిల్లలు పుట్టకపోవడంతో మనస్తాపం చెందిన రాశి శనివారం దమ్మెన్ను కొండాలమ్మ గుడి వద్ద కాలువలో దూకింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టగా ఆదివారం ఆమె మృతదేహం లభ్యమైంది. మృతురాలి తల్లి మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండ్రాజవరం ఎస్సై వి.అప్పలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

నిడదవోలు రూరల్: కోరుమామిడిలో వేంచేసియున్న గోవిందమాంబ సహిత వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్వామివారికి కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

కోటసత్తెమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశా రు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టికెట్లు, ఫొటోల విక్రయం ద్వారా రూ.1,47,469 ఆదాయం వచ్చినట్లు ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ హరిసూర్యప్రకాష్ తెలిపారు.

అంగన్‌వాడీ చిన్నారులకు భోజన ప్లేట్లు అందజేత

తాళ్లపూడి: అన్నదేవరపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న 15 మంది చిన్నపిల్లలకు భోజన ప్లేట్లను ఆదివారం గ్రామానికి చెందిన యువకుడు కొడమంచిలి జాన్ బాబు అందజేశారు. హాస్టల్ విద్యార్థులకు పెన్సిల్ బాక్స్, పెన్నులు, నోట్ పుస్తకాలను 50 మందికి అందజేశారు. కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి, తొండెపు భరత్, రఘు, అబ్బులు, జనసేన నాయకులు, బీజేపీ నాయకులు, అరుంధతి పేట యూత్ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. లక్ష విరాళం



దాత కృష్ణ చైతన్య దంపతులకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు ఆదివారం లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. కొవ్వూరుకు చెందిన కె.కృష్ణ చైతన్య ముందుగా సతీసమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాత దంపతులకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

నేడు ఇంటింటికీ పెన్షన్ల పంపిణీ

ఉండ్రాజవరం: మండలంలో జూలై 1వ తేదీన సోమవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి ఆదివారం తెలిపారు. మండలంలో అన్ని రకాల పింఛన్లు కలసి 10,512 మందికి రూ. 7.17 కోట్లు 149 సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన చెప్పారు.

27 మందికి ఉద్యోగ అవకాశాలు



అనంతపల్లిలో జాబ్ మేళాలో పాల్గొన్న స్వర్ణభారతి ట్రస్ట్ సభ్యులు

నల్లజర్ల: అనంతపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆదివారం నిర్వహించిన జాబ్ మేళాలో 27 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్టు గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ సంస్థ (హైదరాబాదు) హెచ్‌ఆర్ హెడ్ ప్రభాకరెడ్డి, హెచ్‌ఆర్ మేనేజరు మహేష్ తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి 85 మంది అభ్యర్థులు హాజరుకాగా వారికి రాత పరీక్ష నిర్వహించారు. ఐటీఐ, డిప్లమో, ఇంటర్, డిగ్రీ పాసైన వారికి ఉద్యోగ అవకాశం కల్పించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో నల్లజర్ల సాయికృష్ణ, బళ్ల ప్రభాకరావు (నాని) మావుళ్ల సత్యనారాయణ, పూర్ణ కిశోర్ సాయి పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం



మానవత సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న మంత్రి దుర్గేష్

నిడదవోలు: సమాజానికి మానవత సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పట్టణంలోని ఏబీఎస్ టౌన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన నిడదవోలు మానవత సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి మంత్రి దుర్గేష్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. మానవత జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహన్‌రావు నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, శాంతి ర్యాలీ అధ్యక్షుడు గమిని రాంబాబు, జిల్లా కన్వీనర్ బోయపాటి రామలక్ష్మి, కార్యవర్గ సభ్యులు తాతన వెంకట కృష్ణారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నీలం రామారావు, కాజా గంగరాజు, లీలాలక్ష్మి, గాంధీ పాల్గొన్నారు.

14,272 మందికి పింఛన్ పంపిణీకి రంగం సిద్ధం

కొవ్వూరు: రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం సోమవారం ఇంటింటికీ ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ సక్రమంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ పేర్కొన్నారు. ఆదివారం తోగుమ్మిలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి పింఛన్ పంపిణీపై పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలం, పట్టణంలో 14,272 మంది పింఛన్‌దారులకు రూ.9,60,83,000 పింఛన్ సొమ్ము అందజేయాల్సి ఉంటుందన్నారు. కొవ్వూరు మండలంలో 10,257 మందికి రూ.6,82,32,000, పురపాలక సంఘంలో 4,015 మంది లబ్ధిదారులకు రూ.2,78,51,000 సొమ్ము బ్యాంకు నుంచి డ్రా చేసి పంపిణీకి సిద్ధం చేశామన్నారు. అర్బన్‌లో 83, రూరల్‌లో 160 మంది సిబ్బందిని పింఛన్ పంపిణీ నిమిత్తం నియమించామన్నారు. 233 మంది సచివాలయ సిబ్బంది, 10 మంది ఇతర శాఖ సిబ్బందిని నియమించి, మ్యాపింగ్ చేసినట్లు ఆయన ప్రకటించారు.



కొవ్వూరు మండలం తొగుమ్మిలో మాట్లాడుతున్న జేసీ ఎస్.తేజ్ భరత్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

నేడు పింఛన్ల పంపిణీ ప్రారంభం

నిడదవోలు రూరల్: గోపవరంలో ఈనెల 1వ తేదీన సోమవారం ఉదయం 6 గంటలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ జేఏ ఝాన్సీ ఆదివారం తెలిపారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ హాజరవుతారని ఆమె తెలిపారు. నిడదవోలు మండల పరిధిలోని 22 గ్రామ సచివాలయాల్లో పెన్షన్ల పంపిణీకి సంబంధించి పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశామన్నారు.

గ్రామాల్లో వీహెచ్‌పీ మహిళా కమిటీల ఏర్పాటుకు కృషి

నల్లజర్ల: ప్రతి గ్రామంలో విశ్వహిందూ పరిషత్‌ను బలోపేతం చేయాలని ఉత్తరాంధ్ర మహిళా ప్రముఖ్ సునీతాదేవి పిలుపునిచ్చారు. నల్లజర్ల వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఆదివారం మండలశాఖ అధ్యక్షుడు కందుల రవిశేఖర్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సునీతాదేవి మాట్లాడుతూ ప్రతి పల్లెలో కనీసం ఐదుగురు సభ్యులతో మహిళా కమిటీల ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు. జూలై 6,7,8 తేదీల్లో తాడేపల్లిగూడెం గోయంకా కళాశాలలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహిళా సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండలశాఖ ఉపాధ్యక్షురాలు ఆలపాటి ధనలక్ష్మి, జిల్లా కార్యదర్శి ముత్యాల గంగాధర్, వెల్లంకి రాఘవ, మాయలేడి తాతారావు, సవలం రామకృష్ణ, బదిరెడ్డి నాగేశ్వరావు, వంకిన వెంకట్రాజు పాల్గొన్నారు.



నల్లజర్లలో సమావేశమైన విశ్వహిందూ పరిషత్ సభ్యులు

సొసైటీ సభ్యుల వివరాలు కంప్యూటరీకరణ

ఉండ్రాజవరం: పాలంగి సొసైటీ పరిధిలోని సభ్యులందరూ తమ రికార్డ్‌ల వివరాలను తప్పనిసరిగా కంప్యూటరైజేషన్ చేసుకోవాలని పాలంగి సీఈవో పాములపర్తి విష్ణుమూర్తి తెలిపారు. పాలంగి సొసైటీ వద్ద ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సొసైటీ పరిధిలోని పాలంగి, కె.సావరం గ్రామాలకు చెందిన సంఘ సభ్యుల రికార్డులను కంప్యూటరైజేషన్ చేస్తామన్నారు. సంఘంలో సభ్యత్వం తీసుకుని ఇంతవరకు ఏవిధమైన లావాదేవీలు జరపని సభ్యులు సంఘంలో సభ్యులుగా కొనసాగాలంటే తమ రికార్డ్‌లను వెంటనే కంప్యూటరైజేషన్ చేసుకోవాలన్నారు. ఆధార్‌కార్డ్ జెరాక్స్, రెండు ఫొటోలు, ఫోన్ నంబర్‌తో తమ కార్యాలయంలో గురువారం సంప్రదించాలని విష్ణుమూర్తి కోరారు.

రికార్డులను కంప్యూటరైజేషన్ చేయించుకోవాలి

గోపాలపురం: సొసైటీ సభ్యులు తమ రికార్డులను తప్పనిసరిగా కంప్యూటరైజేషన్ చేయించుకోవాలని ఆ సంఘం సీఈవో బి.శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. కేంద్ర రాష్ట్ర సొసైటీ పరిధిలోని మండలంలోని వివిధ గ్రామాల రైతులు తమ పొలాలకు సంబంధించిన రికార్డులను కంప్యూటరైజేషన్ చేయించుకోవాలని సూచించారు. రైతులు సంఘంలో సభ్యుడిగా కొనసాగాలంటే ఆధార్ కార్డు జెరాక్స్, రెండు పాసుపోర్టు సైజు ఫొటోలు, ఫోను నంబరును అనుసంధానం చేయించుకోవడానికి గోపాలపురం సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలని సీఈఓ సూచించారు.

సుందర గోవిందుడికి 1,116 కలశాలతో ఘటాభిషేకం



కొవ్వూరు గోష్పాద క్షేత్రంలోని సుందర గోవిందుడు అభిషేకం చేసేందుకు కలశాలతో నదీ జలాలు తీసుకెళ్తుతున్న భక్తులు



కొవ్వూరు గోష్పాద క్షేత్రంలోని సుందర గోవిందుడికి నదీ జలాలతో ఘటాభిషేకం చేస్తున్న దృశ్యం



కొవ్వూరు గోష్పాద క్షేత్రంలోని హోమాలు చేస్తున్న వేద పండితులు

- వివిధ నదీలతో స్వామి వారికి అభిషేకం
- ముగిసిన సుందరగోవిందుడి బ్రహ్మోత్సవాలు

కొవ్వూరు: పట్టణంలో గోష్పాదక్షేత్రంలోని సుందరగోవిందుడి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామికి సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. దేశ వ్యాప్తంగా వివిధ నదుల నుంచి సేకరించిన నదీ జలాలతో 1,116 కలశాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి సుందర గోవిందుడికి అభిషేకం చేశారు. ఆలయం ప్రతిష్ఠించి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహించారు.

ఆలయ నిర్వాహకులు పొరుపూడి సూర్యరామ సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో వివిధ రకాల హోమాలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. ఈనెల 26 నుంచి కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన కేడర్



మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి, చిత్రంలో జక్కంపూడి రాజా, గూడూరి శ్రీనివాస్

ప్రజల పక్షానే నిలిచాం

- కేడర్ మరింత బలోపేతం కావాలి
- వైఎస్సార్ సీపీ కీలక నేతల దిశానిర్దేశం
- పార్టీ సమావేశానికి భారీగా తరలివచ్చిన శ్రేణులు

రాజానగరం: సార్వత్రిక ఎన్నికల అనంతరం నియోజకవర్గ స్థాయిలో దివాన్‌చెరువులోని ఎంఎఫ్ కన్వెన్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశానికి సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాల నుంచి పార్టీ శ్రేణులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఓటమితో నిరాశ, నిస్పృహలకు ఏమాత్రం తావు లేకుండా, ప్రజల పక్షాన నిలిచామనే భావనతో మరింత బలోపేతం కావాలనే తలంపును అందిస్తూ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ప్రసంగాలతో కేడర్‌ని చైతన్యపరిచారు.

సవాల్‌కు కట్టుబడి ఉన్నా..

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలే దేవుళ్లు, వారిచ్చిన తీర్పును ఎవరైనా శిరసావహించాల్సిందేనన్నారు. రాజానగరం మండలంతో తమ కుటుంబానికున్న అనుబంధాన్ని దృష్టిలో పెట్టుకుని, ఈ మండల ప్రజలు తనకు ఎల్లప్పుడూ అండదండగా ఉంటారనే ఉద్దేశంతో ఎన్నికల్లో ఈ మండలంలో ఒక్క ఓటు ఎక్కువ తెచ్చుకున్నా, తాను రాజకీయాల నుంచి తప్పుకుంటాని ప్రత్యర్థికి సవాలు చేశానన్నారు. అయితే రాజకీయాల్లో ఉన్నప్పుడు మాట అనేది వ్యక్తిగతమని, నిర్ణయం మాత్రం సమష్టిగానే ఉంటుందని. తమ కుటుంబాన్ని అభిమానిస్తూ, ఆదరిస్తున్న వేలాది మంది కార్యకర్తల నిర్ణయం మేరకు నడుచుకోవాల్సి ఉంటుందన్నారు. నియోజకవర్గంలో గడచిన ఐదేళ్లలో తాను చేసిన అభివృద్ధి కంటే ఎక్కువ చేయగలరని అనిపించిన రోజున, తాను చెప్పిన మాటకు కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. ఏడాదిలోగా ఈ మేరకు అభివృద్ధి చూపగలిగితే తన మాటకు కట్టుబడి ఉంటానని వివరించారు. జక్కంపూడి కుటుంబానికి అధికారంతో, పదవులతో పనిలేదని, ఎవరికి కష్టం వచ్చినా కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. ఒక లాఠీ అయినా, తూటా అయినా జక్కంపూడి కుటుంబాన్ని దాటుకుని ముందుకు రావాలన్నారు.

వెనకడుగు వేసేది లేదు

పార్టీలో గ్రూపులు మంచిది కాదని, ఓటమికి అది కూడా కారణమనే భావిస్తున్నాను జక్కంపూడి రాజా అన్నారు. చాలాచోట్ల బహు నాయకత్వం ఉండటం భారీ నష్టం చేకూర్చిందని, కేడర్‌లో పోటీ తత్వం ఉంటే పార్టీ పటిష్టమవుతుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నామని వెనకడుగు వేసేది లేదని, అధికారంలో ఉన్నదాని కంటే ఎక్కువగా పని చేస్తామన్నారు. పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు ఎటువంటి కష్టం వచ్చినా జక్కంపూడి కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా తమకు ప్రజలే ముఖ్యమన్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లోని పార్టీకి చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.